సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం • 11 • జూలై • 2024



ప్రతి నీటిబొట్టు ఒడిసిపట్టేలా..

పాఠశాలల్లో ఏర్పాటు చేసిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం సత్ఫలితాన్నిస్తోంది.

వివరాలు 8లో ▸



..బ్యాడ్మింటన్ టోర్నీ

మహబూబ్‌నగర్‌లో విద్యుత్ ఉద్యోగుల బ్యాడ్మింటన్ టోర్నీ ఉత్సాహంగా సాగింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /24.3

వాతావరణం

రోజులో ఎక్కువ శాతం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

కేఎల్ఐ పైనే ఫోకస్



కేఎల్ఐ ప్రాజెక్టు గుడిపల్లి రిజర్వాయర్‌లోకి పంపుల ద్వారా ఎత్తిపోస్తున్న నీరు

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు

- కేఎల్ఐ కింద మొత్తం 4.50 లక్షల ఎకరాలకు నీరందించేందుకు సన్నద్ధం
- సీఎం రేవంత్ ఆదేశాలతో 2025 చివరిలోగా పూర్తిచేసేలా ప్రణాళిక
- 'పాలమూరు' ప్రాజెక్టును కర్వెన వరకు సిద్ధం చేసేలా కార్యాచరణ

సాక్షి, నాగర్‌కర్నూల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో నిర్మాణాన్ని పూర్తిచేసి ఆయకట్టు రైతులకు నీరందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసంపూర్తిగా ఉన్న కేఎల్ఐ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని మంగళవారం ఉమ్మడి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 2025 డిసెంబర్ నాటికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సుమారు 20 ఏళ్లుగా అసంపూర్తి ప్రాజెక్టుగా ఉన్న కేఎల్ఐపై సీఎం దృష్టి పెట్టడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు నెలకొన్నాయి.

4.50 లక్షల ఎకరాల సామర్థ్యానికి పెంపు..

ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, జడ్చర్ల , వనపర్తి నియోజకవర్గాల్లోని సుమారు 4.50 లక్షల ఎకరాల వరకు నీరందించేందుకు చేపట్టిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఏళ్లుగా పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోక సగం ఆయకట్టుకే పరిమితమైంది. ప్రస్తుతం 3.07 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నామని అధికారులు చెబుతున్నా, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు నిర్మించని కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు. ప్రస్తుతం ఎల్లూరు, జొన్నలబొగడ, గుడిపల్లి రిజర్వాయర్లలో నీటిని నింపి వాటి పరిధిలోని చెరువులు, కుంటలకు నీరందిస్తున్నారు. మూడు ప్యాకేజీల కింద చేపట్టిన ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా ఉండటంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందటం లేదు. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు సైతం పూర్తిస్థాయిలో లైనింగ్ నిర్వహించక, కొన్నేళ్లుగా నిర్వహణ సైతం లేక ఆయకట్టు రైతులకు సరిపడా నీరు అందటం లేదు.

> **2025 వరకు పూర్తిచేసేలా చర్యలు..**
>
> కేఎల్ఐ ప్రాజెక్టు కింద 28, 29, 30 ప్యాకేజీలను పూర్తిస్థాయిలో నిర్మాణం చేసేలా ప్రణాళిక సిద్ధం అవుతోంది. మొత్తం 4.50 లక్షల ఎకరాలకు నీరందించేలా పనులు నిర్వహిస్తాం. పాలమూరు ప్రాజెక్టు కింద కర్వెనతో పాటు ఉద్దండాపూర్ వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వేగంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.
>
> – విజయ్‌భాస్కర్‌రెడ్డి, సీఈ, నీటి పారుదలశాఖ

విస్తరణ పనులతో మేలు..

కేఎల్ఐ కింద 28 ప్యాకేజీలో విస్తరణ పనులతో పాటు 29, 30 ప్యాకేజీలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 29 ప్యాకేజీలోనూ డీ82 కెనాల్ విస్తరణతో సుమారు 37 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ విస్తరణ ద్వారా ఉప్పునుంతల మండలం వరకు 15 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోనున్నారు. తర్వాతి దశలో 30 ప్యాకేజీ విస్తరణలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలం వరకు ఆయకట్టు విస్తరించేలా డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు, కాల్వలను నిర్మించనున్నారు. కేఎల్ఐ ప్రాజెక్టు కింద చేపట్టిన మూడు ప్యాకేజీల పరిధిలో 28 ప్యాకేజీలో 84 కి.మీ, 29 ప్యాకేజీ కింద 160 కి.మీ, 30 ప్యాకేజీ కింద మరో 80 కి.మీ. మేర కాల్వలను తవ్వాల్సి ఉంది. ఈ మేరకు భూసేకరణ పనులతో పాటు పునరావాస ప్రక్రియ వేగంగా పూర్తిచేసి 2025 నాటికి ప్రాజెక్టు పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.



కుమ్మెర సమీపంలో కేఎల్ఐ కాల్వ

'పాలమూరు' పనులపై సందిగ్ధం..

ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని సుమారు 12.5 లక్షల ఎకరాలకు నీరందించేలా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లను పూర్తికాగా, పంప్ హౌస్, మోటార్ల బిగింపు టన్నెళ్లు, కాల్వల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోంది. పాలమూరు ప్రాజెక్టు కింద చేపట్టిన పనులను కర్వెన ఆ తర్వాత ఉద్దండాపూర్ వరకు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయితే ఇందుకు అవసరమైన నిధుల కేటాయింపుపై నిర్ణయం తీసుకోనందున పనుల పురోగతిపై అనుమానాలు నెలకొన్నాయి. పాలమూరు ప్రాజెక్టు కింద కర్వెన రిజర్వాయర్ వరకు 2024 కల్లా నిర్మాణ పనులను పూర్తిచేయాలని భావిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష



ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల పురోగతిపై బుధవారం హైదరాబాద్‌లో సమావేశమైన మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజ నర్సింహ, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు, అధికారులు

ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజ నర్సింహ బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అధికారులతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల పనుల పురోగతి, భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపు తదితర అంశాల వారీగా చర్చించారు. ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక అందజేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కసిరెడ్డి నారాయణరెడ్డి, పర్ణికారెడ్డి, వీర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, నీటి పారుదల శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) అనిల్ కుమార్, ఈఎన్సీ ఆపరేషనల్ నాగేంద్రరావు, సీఈలు విజయభాస్కర్ రెడ్డి, రఘునాథరావు, బీవీ రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ధర్నా

కల్వకుర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే మానుకోవాలని బిల్డింగ్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా నాయకుడు శివరాములు అన్నారు. బుధవారం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలను సవరిస్తూ.. పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ క్రైం: వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో కలెక్టర్ బదావత్ సంతోష్, రాష్ట్ర మలేరియా, ఫైలేరియా అదనపు డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా సీజనల్ వ్యాధులు సోకితే 98667 56825కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సాధారణంగా వర్షాకాలంలో మలేరియా, గన్యా, అతిసార, విషజ్వరాలు వంటివి ప్రబలేందుకు ఆస్కారం ఉందన్నారు. అందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కంట్రోల్ రూంకు వచ్చిన ఫిర్యాదులకు యుద్ధ ప్రాతిపదికన వైద్య బృందాలు స్పందించి చర్యలు తీసుకునేలా సన్నద్ధం చేశామన్నారు. రూరల్ వాటర్ సప్లయ్, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఫిషరీస్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, విద్యాశాఖ డీఆర్‌డీఏ, మున్సిపల్, పబ్లిక్ రిలేషన్ లాంటి శాఖలతో సమన్వయంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఏఎన్ఎం ఆశవర్కర్లు డ్రై డే సందర్భంగా ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు, పరిసరాలు ఎలా ఉన్నాయి అనే విషయాలను తాను గ్రామాల పరిశీలించిన సందర్భంగా ఇంటి యజమానులను అడిగి తెలుసుకుంటానని తెలియజేశారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్, డీపీఓ డీఆర్‌డీఓ, డీడబ్ల్యూఓ, విద్యాశాఖ అధికారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు

నాగర్‌కర్నూల్: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల నుంచి ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించారు. ప్రజల నుంచి సేకరిస్తున్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల నుంచి దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు పథకం లబ్ధి చేకూరాలని, వారి కోసం , ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రంలో లబ్ధిదారుల నుంచి గృహజ్యోతి, 500 గ్యాస్ కనెక్షన్ పథకం కోసం అవసరమైన సరైన ధ్రువపత్రాలతో పాటు ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్న రసీదులు పరిశీలించి, లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే లబ్ధి చేకూరేలా అవకాశాలు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మున్సిపల్ చైర్మన్ కమిషనర్లతో సమావేశమై మున్సిపల్ కార్యాలయ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మత్స్య మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎఫ్‌సీఎస్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు

నాగర్‌కర్నూల్: ప్రతి గ్రామంలో మత్స్య మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలని డీఎఫ్‌సీఎస్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ సమావేశ మందిరంలో జాతీయ మత్స్య కృషి వలుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఎఫ్‌సీఎస్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం నుంచి వచ్చే మహిళా రుణాలను మత్స్య మహిళా సంఘాలు వినియోగించుకోవాలన్నారు. జిల్లా సొసైటీ సభ్యులందరికీ జాతీయ మత్స్య కృషి వలుల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. చెరువుల్లో చేపల పెంపకంలో సొసైటీ సభ్యులతో పాటు మత్స్య సహకార సంఘాల యువకులు పాల్గొని ఉత్పత్తి పెంచి ఆదాయ వనరులు సృష్టించాలని సూచించారు. సభ్యులు అందరూ త్వరగా ఫిషర్ మాన్ డాటాను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను, క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేస్తూ జిల్లాలోని 19,000 మంది సొసైటీ సభ్యులకు అందజేయాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు సొసైటీలోని లోటుపాట్లను సరిచేస్తూ.. సభ్యులకు అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రహమాన్, జిల్లా వైస్‌చైర్మన్ తుమ్మల అల్లోజి, డైరెక్టర్స్ వెంకటయ్య, అజ్జమోని నరసింహ, వెంకటయ్య, ఈశ్వర్, గొడుగు బాలచందర్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో అలసత్వం వద్దు

- చెంచు మహిళ ఈశ్వరమ్మ కుటుంబానికి అండగా ఉంటాం
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

వివరాలు 10లో ▸



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

న్యూస్‌రీల్

కొత్త చట్టాలపై అవగాహన అవసరం



పెద్దకొత్తపల్లి: భారత ప్రభుత్వం భారతీయ న్యాయ కొత్త చట్టాలను ఈ నెల 1వ తేదీ నుంచి అమలులోకి తీసుకొచ్చిందని కొల్లాపూర్ సివిల్ జూనియర్ జడ్జి శ్రీనిధి తెలియజేశారు. వాటిపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బుధవారం పెద్దకొత్తపల్లి గ్రామపంచాయతీ వద్ద న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు పిల్లలకు 'జ్ఞానం' అనే సంపదను ఆస్తిగా ఇవ్వాలని సూచించారు. తప్పనిసరిగా పిల్లలను సమాజానికి ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు చేస్తున్నారని, వాటిని నిషేధించాలని సూచించారు. చదువుతో పాటు మానవ విలువలను పెంపొందించుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో చిన్న సమస్యలను పెద్దమనుషుల సమక్షంలో కూర్చొని మాట్లాడి రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి వీలుందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే జాతీయ లోక్అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిన్న కురుమయ్య, నిరంజన్, బాలస్వామి, మోహన్‌లాల్, రామలక్ష్మమ్మ, నళిని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి



అచ్చంపేట రూరల్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని బీకే ఫంక్షన్ హాలులో విద్యాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీఈఓ గోవిందరాజులు హాజరు కాగా.. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలకు సంబంధించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, ఇతర పాఠశాలల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాల మౌలిక వసతులను అడిగారు. సమస్య ఉన్న పాఠశాల వివరాలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విధులపై అంకితభావంతో పని చేయాలన్నారు. కొద్ది రోజుల్లోనే అన్ని సమస్యలు తీరుతాయని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెరుగైన విద్యనందించి, ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు, జీహెచ్ఎంలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

చారకొండ: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని జేపల్లిలో బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీ నూతన భవనానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశామని, త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో అభివృద్ధి పనులకు కృషి చేస్తానని తెలియజేశారు. రైతు భరోసా, రుణమాఫీపై రైతులు అపోహలు చెందవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, వెంకట్ గౌడ్, బాల్‌రాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొందరికే కిసాన్ సమ్మాన్

- పీఎం కిసాన్ నిధి పథకంలో ఏటా తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య
- పలు రకాల నిబంధనలే కారణం
- అవగాహన లేక నష్టపోతున్న రైతులు
- 17వ విడత నిధులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం



జిల్లాలో ప్రస్తుతం అర్హులు	1,49,782 మంది రైతులు

అచ్చంపేట: రైతులకు పెట్టుబడి సాయం, ఇతర అవసరాల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హత కలిగిన రైతులకు సంవత్సరంలో మూడు విడతలుగా రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేల నగదును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ పథకం అమలులో ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఏటా రైతుల సంఖ్య పెరుగుతున్నా.. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య మాత్రం తగ్గుతూ వస్తోంది. అర్హులు తప్పనిసరిగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఐడీ నంబర్‌కు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి. ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోకపోవడంతో ఈ పథకానికి దూరమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా రైతులకు 16 విడతల్లో రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసింది. తాజాగా గత నెలలో 17వ విడత సైతం విడుదల చేయగా.. ప్రారంభంలో ఉన్న అర్హులైన రైతులతో పోల్చితే ప్రస్తుతం వారి సంఖ్య గణనీయంగా తగ్గింది.

తగ్గిన అర్హులు ..

జిల్లాలోని 20 మడలాల పరిధిలో 3,22,724 మంది రైతులు ఉన్నారు. మొత్తం 7,59,793 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరాలనే లక్ష్యంతో ప్రారంభంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి ఐదెకరాల లోపు భూమి ఉన్న వారిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. జిల్లాలో ఐదెకరాల లోపు 2,29,013 మంది రైతులు ఉండగా వీరికి 3,09,946 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2018–19లో మొదటి విడత 1,92,892 మంది రైతులను అర్హులుగా గుర్తించి రూ.38.58కోట్ల నిధులు అందజేశారు. 16వ విడతకు వచ్చే సరికి 85,982 మంది రైతులకు రూ.17.20 కోట్లు తగ్గిపోయింది. 17వ విడతకు వచ్చే సరికి 1,49,782 మంది రైతులకు రూ.29.96 కోట్ల నిధులు అందజేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పీఎం కిసాస్ అర్హుల జాబితా రూపొందించింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లించే వారికి పథకాన్ని నిలిపివేశారు. ప్రస్తుతం కుటుంబంలో భార్య లేదా భర్తకు ఒక్కరికి మాత్రమే పథకాన్ని వర్తింపజేస్తున్నారు.

నిబంధనల మేరకే..



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోతుంది. పథకం ప్రారంభంలో ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉండేది. ఉద్యోగులు, రూ.10వేల పింఛన్లు పొందే రైతులు, ఆదాయ పన్ను చెల్లించే పరిధిలోకి వచ్చే రైతులు, కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తింపు వంటి నిబంధనలతో సాయం పొందే వారి సంఖ్య తగ్గింది. ఆధార్‌కార్డు అనుసంధానం లేని కారణంగా మరి కొందరికి డబ్బులు జమ కావడం లేదు.

– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి

ఒక్క పైసా పడలేదు



నాకు 1.20 ఎకరాల భూమి ఉంది. మా ఊరిలో చాలా మందికి కేంద్రం పైసలు పడుతున్నాయి. కానీ నాకు మాత్రం ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా పడలేదు. ఎందుకు పడుతలేవో కూడా తెలుస్తలేదు. ఈ ఏడాది కూడా దరఖాస్తు చేసుకున్నా. నాలాంటి వారికి అధికారులు సాయం చేయాలి.

– బొడ్డపల్లి సాయులు, రైతు జంగంరెడ్డిపల్లి, అమ్రాబాద్ మండలం

కొత్తవారికి అవకాశం ఇవ్వాలి



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కొత్తగా పాస్‌పుస్తకం పొందిన రైతులకు కూడా అవకాశం ఇవ్వాలి. 2019కి ముందు నుంచి నాకు 1.20 ఎకరాల పొలం ఉంది. మొదటి నుంచి మాకు పీఎం కిసాన్ రావడం లేదు.

– ఎండీ సుల్తాన్, రైతు కొండనాగుల, బల్మూర్ మండలం

జిల్లాలో 17 విడతల్లో(ఏడాదికి మూడు పంటలకు) పీఎం కిసాన్‌లో రైతులకు అందిన సాయం ఇలా..

సంవత్సరం	సాయం పొందిన రైతులు	అందిన డబ్బు (రూ.కోట్లలో)
2018-19	1,92,892	38.58
2019-19	1,91,432	38.29
2019-19	1,87,971	37.59
2019-20	1,84,812	36.96
2020-20	1,83,596	36.71
2020-20	1,82,124	36.42
2021-21	1,80,114	36.02
2021-21	177,111	35.42
2021-21	1,75,007	35.00
2021-22	1,71,866	34.37
2022-22	167,379	33.48
2022-22	1,51,400	30.28
2022-23	1,33,944	26.79
2023-23	1,21,345	24.27
2023-23	1,09,995	21.99
2023-24	85,982	17.20
మొత్తం	19,51,727	519.37

ప్రతి నీటిబొట్టు ఒడిసిపట్టేలా..

- పాఠశాలల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం ఏర్పాటు
- వర్షపు నీటిని ఫిల్టర్‌చేసి నిల్వ
- ఐసీఐసీ ఫౌండేషన్ సహకారంతో తీరిన నీటి సమస్య

గండేడ్: భూగర్భజలాల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా వర్షపునీరు వృథా కాకుండా ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టేందుకు అవసరమైన పనులు చేపడుతోంది. ఈ తరుణంలో రేయిన్ వాటర్ హార్వేస్టింగ్ సిస్టంతో సత్ఫలితాలు సాధిస్తున్నారు. వర్షపునీటిని ఏ మాత్రం వృథా చేయకుండా ఫిల్టర్ చేసి, తాత్కాలిక అవసరాలకు వాడుకొనేలా ఐసీఐసీ ఫౌండేషన్ వారు రూపొందించిన వీటిని పాఠశాలలు, వసతిగృహాల్లో ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు నీటి కష్టాలు తీరాయి. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో 49 గ్రామపంచాయతీలు ఉండగా.. 83 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మహమ్మదాబాద్ మండలంలోని 9 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 9 జెడ్పీహెచ్‌ఎస్, గండేడ్ మండలంలోని 6 ప్రాథమిక , ప్రాథమికోన్నత, 7 జెడ్పీహెచ్‌ఎస్, హన్వాడ మండలంలో 9 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలల్లో రేయిన్ వాటర్ హార్వేస్టింగ్ సిస్టం ఏర్పాటుచేశారు.



వెన్నాచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పైకప్పు నుంచి వర్షపు నీరు రావడానికి ఏర్పాటుచేసిన పైప్‌లైన్

భూగర్భజలం పెంపు..

వర్షపునీటిని అవసరాలకు వినియోగించే విధంగా రూపకల్పన చేయడంతో పాటు వాడిన నీరు సైతం వృథా కాకుండా మరో విధానాన్ని రూపొందించారు. వర్షపు నీరు నిల్వ చేసుకునే సంపు పక్కనే మరో పెద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేశారు. అందులో పలుగు రాళ్లు, బొగ్గు, ఇసుక వంటివి వేసి ఇంకుడు గుంత నిర్మించారు. హ్యాండ్ పంపు ద్వారా వాడుకున్న సంపు నీళ్లు ఇంకుడు గుంతలోకి వెళ్లేలా పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దీన్ని వల్ల చుక్క నీరు వృథా పోకుండా ఉండటమే గాక, భూగర్భజల పరిరక్షణకు తోడ్పడుతోంది.



వర్షపు నీటిని వాడుకుంటున్న విద్యార్థినులు

తీరిన నీటి కొరత..



పాఠశాలలో ఐసీఐసీ ఫౌండేషన్ ఏర్పాటుచేసిన రేయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం విద్యార్థులకు నీటి అవసరాలు తీరుస్తోంది. పాఠశాలలో మిషన్ భగీరథ నల్లాతో పాటు బోరు కూడా ఉంది. టాయిలెట్లు, మొక్కల పెంపకం వంటి వాటికి నీటి వినియోగం పెరిగింది. ఈక్రమంలో రేయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టంతో విద్యార్థులకు నీటి కొరత తీరింది.

– చంద్రకాంత్, జీహెచ్‌ఎం, వెన్నాచేడ్ జెడ్పీహెచ్‌ఎస్

ఇబ్బందులు తొలగాయి..



పాఠశాలలో నీటి వసతి లేక గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. ఉన్న బోరు కాలిపోవడంతో నాలుగైదు రోజులు నీళ్ల కోసం నానా పాట్లు పడ్డాం. ఇటీవల పాఠశాలలో రేయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం ఏర్పాటు చేయడంతో సమస్య తీరింది. అవసరమైనప్పుడు వర్షపు నీటిని వాడుకుంటున్నాం. దీంతో ప్రత్యక్ష అనుభవం కూడా కలుగుతుంది. అత్యవసర సమయాల్లో ఇది చక్కగా ఉపయోగపడుతుంది.

– పి.సింధు, తొమ్మిదో తరగతి

నీరు వృథా కాకుండా..



వర్షపునీటి కోసం ఏర్పాటు చేసిన ఫిల్టర్, నీటిని వాడుకునేందుకు ఏర్పాటు చేసిన హ్యాండ్‌పంప్

వర్షపునీరు వృథా కాకుండా కొంతమేర అవసరాలు తీర్చుకోవాలన్న ఉద్దేశంతో రేయిన్ వాటర్ హార్వేస్టింగ్ సిస్టం ఏర్పాటుకు ఐసీఐసీ ఫౌండేషన్ సంకల్పించింది. పాఠశాల భవనాలపై పడ్డ వర్షపునీటిని ఒడిసిపట్టి, స్టోర్ చేసుకునేలా దీన్ని రూపొందించారు. ఒక్కో యూనిట్‌కు రూ. 2లక్షల వరకు వెచ్చించారు. పాఠశాల రూఫ్ చుట్టూ పైపులు బిగించి, పడ్డ చినుకు పడ్డట్టే పైపుల్లోకి చేరేలా అమర్చారు. అక్కడి నుంచి వచ్చే నీరు ఫిల్టర్ అయిన తర్వాత నేరుగా సంపులోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఒక్కో సంపు 5 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించారు. సంపులోకి చేరే నీటిని వినియోగించేందుకు చేతిపంపు తరహాలో హ్యాండిల్ బిగించారు.


సత్ఫలితాలు ఉన్నాయి..

వర్షపునీరు వృథా కాకుండా అవసరాలకు వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో రేయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం ఏర్పాటు చేశాం. ఒక్కో యూనిట్‌కు రూ. 2లక్షలకు పైగా వెచ్చించాం. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేయడం వల్ల నీటి సమస్యను అధిగమించే అవకాశం లభించింది. జిల్లాలోని గండేడ్, మహమ్మదాబాద్, హన్వాడ మండలాలతో పాటు వికారాబాద్ జిల్లా కొడంగల్, కుల్కచర్ల, బొంరాస్‌పేట్ తదితర మండలాల్లో వీటిని ఏర్పాటు చేశాం. అన్ని చోట్ల సత్ఫలితాలు ఇస్తున్నాయి.

– జి.భానుకుమార్, ఐసీఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్

లెక్కతప్పనివ్వం..

- విద్యార్థులకు గణితం బోధించిన కలెక్టర్ సిక్తాపట్నాయక్



జాజాపూర్‌లో టెన్త్ విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట రూరల్: నారాయణపేట మండలంలోని జాజాపూర్ జెడ్పీ స్కూల్‌ను కలెక్టర్ సిక్తాపట్నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఆ తర్వాత 9, 10వ తరగతి గదులకు వెళ్లగా అక్కడ గణితం క్లాస్‌లు కొనసాగుతున్నాయి. వెంటనే ఆయా తరగతుల్లోని సమితులు, సాంఖ్యాక శాస్త్రం అధ్యాయాలకు సంబంధించిన లెక్కలను స్వయంగా తానే పిల్లలకు బోధిస్తూ.. తిరిగి పిల్లలతో మాదిరి ప్రశ్నలు వేసి బోర్డుపై చేయించారు. అదేవిధంగా పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో సైతం పిల్లలతో ముచ్చటించి పాఠ్యాంశాలను బోధిస్తూ, వివిధ అంశాలను బోర్డుపై రాస్తూ జవాబులు రాబట్టారు. సుమారు రెండు గంటల పాటు కలెక్టర్ ఒక ఉపాధ్యాయురాలిగా వ్యవహరించారు. జాజాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్‌ఘని, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, జీహెచ్‌ఎం భారతి, పీఎస్ హెచ్‌ఎం నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన కుక్క 'పంచాయితీ'

- పెంపుడు కుక్కను కొట్టాడని తమ్ముడిపై దాడి
- అన్నపై పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య
- నాగర్‌కర్నూల్ జిల్లా వెల్గొండలో ఘటన



కుందేళ్ల రాజు (ఫైల్)

బిజినేపల్లి: తన పెంపుడు కుక్కను రాయితో ఎందుకు కొట్టావని తమ్ముడితో అన్న గొడవ పడి కొట్టాడు. ఈ పంచాయితీ పోలీసుస్టేషన్ వరకు చేరింది. కుక్క మొరిగిందని రాయితో కొట్టాడు.. కుక్కను ఎందుకు కొట్టావని యజమాని గొడవపడ్డాడు. ఆ గొడవ పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. పోలీసులు మందలించడంతో మనస్తాపానికి గురైన అన్న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని వెల్గొండకు చెందిన కుందేళ్ల రాజు, బీరయ్య అన్నదమ్ములు. తండ్రి మల్లయ్య పెద్దకుమారుడితోనే ఉంటున్నాడు. ఇటీవల తండ్రి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తమ్ముడు బీరయ్య ఈ నెల 7న(ఆదివారం) అన్న ఇంటికి వచ్చి తండ్రిని పరామర్శించి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాజు పెంపుడు కుక్క బీరయ్యను చూసి మొరగడంతో అతను రాయితో కొట్టాడు. దీంతో అన్న వచ్చి తన పెంపుడు కుక్కను ఎందుకు కొట్టావని తమ్ముడితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో అన్నదమ్ములిద్దరి మధ్య మాటమాట పెరగడంతో తమ్ముడిని అన్న కర్రతో తలపై కొట్టాడు. బీరయ్య తలకు గాయం కావడంతో సోమవారం బిజినేపల్లి ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డికి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అన్న రాజును పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మందలించి కేసు నమోదు చేశారు. తిరిగి మంగళవారం కూడా రాజును ఎస్‌ఐ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, సాయంత్రం ఇంటికి పంపించాడు. మళ్లీ బుధవారం కూడా స్టేషన్‌కు రావాలని తెలిపారు. ఇది ఇలా ఉండగా.. బీరయ్యపై సొంత బావమరిదిని హత్య చేసిన కేసు, రౌడీషీటర్ కేసు, గ్రామంలో ఇతరాత్ర గొడవలు పెట్టుకున్న కేసులు, చోరీల కేసులు ఉన్నాయి. అలాంటి బీరయ్య తనపై కేసు పెట్టించగా.. పోలీసులు ఎటువంటి విచారణ చేపట్టకుండా తనను పోలీస్‌స్టేషన్‌కు పిలిపిస్తున్నారని అన్న మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం బిజినేపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి వచ్చిన అన్న రాజు బుధవారం తెల్లవారుజామున వంట గదిలో ఉరేసుకున్నాడు. రోజు లాగే భార్య లక్ష్మీ నిద్ర లేసి వంట గదిలోకి వెళ్లగా.. భర్త వంటగదిలో ఉరేసుకుని కనిపించాడు. భయాందోళనకు గురైన భార్య కేకలు వేస్తూ.. బయటకు వచ్చింది. స్థానికులు వచ్చి చూడగా.. అప్పటికే మృతిచెందాడు. పోలీసులు వేధించి, చేయిచేసుకోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా.. విచారణ కోసమే స్టేషన్‌కు పిలిపించామని, చాలా రోజులుగా ఇద్దరి అన్నదమ్ముల మధ్య కుటుంబ వివాదాలు ఉన్నాయన్నారు. వాటిని పెద్దల సమక్షంలో చర్చించుకుని పరిష్కరించుకోవాలని తెలియజేశామని, అతనిపై చేయి చేసుకోవడం, దుర్భాషలాడటం చేయాలేదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న స్థానికులు

జడ్చర్ల: బూరెడ్డిపల్లి క్రాస్ రోడ్ వద్ద 44వ నంబర్ జాతీయరహదారిపై బుధవారం ఓ బైక్‌ను అతివేగంగా బొలేరో ఢీకొట్టిన ఘటనలో.. బైక్‌పై ఉన్న శ్రీను(40) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం నేరెళ్లపల్లికి చెందిన శ్రీను బైక్‌పై బూరెడ్డిపల్లి గ్రామం వైపు జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు ఆలుగడ్డ లోడ్‌తో వెళ్తున్న బొలేరో ఢీ కొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని వెంటనే 108లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను మృతిచెందాడు. ఘటనపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

ఫ్లైఓవర్ నిర్మించాలని ఆందోళన..

కాగా బూరెడ్డిపల్లి క్రాస్ రోడ్‌వద్ద ప్రతి రోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై అడ్డంగా బస్తాలు వేసి రాకపోకలను కొద్దిసేపు అడ్డుకుని ఆందోళన చేశారు.

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి (55) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దేవరకద్ర మండలం పేరూర్ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ వివరాల మేరకు.. పేరూర్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు బూడిద రంగు షర్ట్, జీన్స్ ప్యాంట్ ధరించాడని రైల్వే ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మహబూబ్‌నగర్ క్రైం: గూడ్స్ రైలు కిందపడి ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని బోయపల్లి గేట్‌కు చెందిన షాహిన్ అఫ్రిన్ స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, కొన్ని రోజులుగా ఆమె మానసిక సమస్యతో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నవాబుపేట: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గోవానిపల్లి సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రమ్ కథనం మేరకు.. కాకినాడలోని ఏలేశ్వరం గ్రామానికి చెందిన గొల్ల నూకార్జున (50) రాజమండ్రి నుంచి డీసీఎంలో పండ్ల మొక్కలు మండలానికి తీసుకొచ్చాడు. కారూర్‌లోని ఓ రైతు వ్యవసాయ పొలంలో సగం ఖాళీచేసి మిగతావి లింగంపల్లికి తీసుకెళ్తుండగా.. ఇప్పటూర్ రోడ్డులో గోవానిపల్లి సమీపంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు వాహనానికి తగిలాయి. తీగలు తగిలిన శబ్దం గుర్తించిన నూకార్జున వాహనం దిగుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనంలో లభించిన రసీదు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని ఎస్‌ఐ వివరించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

గంగాపురంలో మరో మహిళ..

జడ్చర్ల టౌన్: గంగాపురంలో విద్యుత్‌షాక్‌తో నర్ల అంజమ్మ (45) అనే మహిళ మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కూలీపనులు చేసుకుని ఇంటికి ఆలస్యంగా వచ్చిన అంజమ్మ.. లైట్ వేయడం కోసం బోర్డుపై ఉన్న స్విచ్ ఆన్‌చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో షాక్ తగిలి అక్కడికక్కడే బిగుసుకుపోయారు. గట్టిగా కేకలు వినిపించడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూడగా అప్పటికే ఆమె మృతిచెందారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయండి

- మంత్రి శ్రీధర్ బాబుకు ఎంపీ మల్లు రవి విజ్ఞప్తి



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ మల్లు రవి

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఎంపీ మల్లు రవి కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రితో ఆయన భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల పరిధిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నీటి లభ్యత అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈనెల 17న కల్వకుర్తి పరిధిలోని కడ్తాల్‌లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ భవనం ప్రారంభోత్సవానికి రావాలని మంత్రి శ్రీధర్ బాబును ఆహ్వానించారు.

బాలిక కిడ్నాప్.. కేసు నమోదు

కొత్తకోట రూరల్: ప్రేమిస్తున్నానంటూ ఓ యువకుడు మాయమాటలు చెప్పి బాలికను కిడ్నాప్ చేసినట్లు కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని ఓ తండాకు చెందిన గిరిజన కుటుంబం కొంతకాలంగా కొత్తకోటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటోంది. పట్టణానికి చెందిన గోవర్ధన్ అనే యువకుడు కొంతకాలంగా ఆ ఇంటి బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. బుధవారం ఉదయం ఇంట్లో బాలిక కనిపించకపోవడంతో తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గోవర్ధన్ కిడ్నాప్ చేసి ఉంటాడని ఫిర్యాదులో పేర్కొనడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జూరాలకు ఇన్‌ఫ్లో నిల్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా ఆగిపోయినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం ఎలాంటి ఇన్‌ఫ్లో లేదని వివరించారు. కాగా ఆవిరి రూపంలో 132 క్యూసెక్కులు, మొత్తం ప్రాజెక్టు నుంచి ఇతర అవసరాలకు 88 క్యూసెక్కులు, 220 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.721 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం నిలకడగ కొనసాగుతోంది. జూరాల సమాంతర కాల్వ, ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. బుధవారం నాటికి జలాశయంలో పూర్తి నీటి మట్టం 1,020 అడుగులుగా ఉంది. కాగా తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లి చౌరస్తా: పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ఉదండాపురానికి చెందిన గొల్ల నర్సింహులు (34) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం సాయంత్రం పొలానికి వెళ్లి పురుగుమందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కొనసాగుతున్న నీటి పంపింగ్

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రస్తుత వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని కేఎల్‌ఐ అధికారులు రెండు రోజులుగా గుడిపల్లి రిజర్వాయర్ వద్ద రెండు మోటార్ల ద్వారా నీటి పంపింగ్ కొనసాగిస్తున్నారు. ఆదివారం రాత్రి మొదటి పంప్‌ను ప్రారంభించిన అధికారులు సోమవారం నుంచి రెండో మోటార్ ప్రారంభించారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటిని రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. రిజర్వాయర్ నిండగానే కాల్వల ద్వారా పూర్తిస్థాయిలో చెరువులు నింపే కార్యక్రమాన్ని చేపడుతామని కేఎల్‌ఐ డీఈ భద్రయ్య వెల్లడించారు. వర్షాకాలం కావడంతో జూరాలకు వస్తున్న స్వల్ప వరద నీటిని కిందకు వదలుతుండడం వల్ల గుడిపల్లి రిజర్వాయర్‌ను నింపుతున్నట్లు తెలిపారు.



యువకుడికి తీవ్ర గాయాలు

ఉప్పునుంతల: ఉప్పునుంతల – జప్తీ సదగోడు రోడ్డు మార్గంలో ఉస్మాన్ ఫౌల్ట్రీఫాం సమీపంలోని మూలమలుపు వద్ద బుధవారం బోరుబండి, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మందుల శ్రీకాంత్ బైక్‌పై సదగోడు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బోరుబండి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న శ్రీకాంత్ తలకు బలమైన గాయమై రక్తస్రావం కావడంతో బాధితుడిని వెల్దండ సమీపంలోని యెన్నం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.



పశువులను తరిమేస్తున్న మున్సిపల్ జవాన్



మెట్టుగడ్డలో నడిరోడ్డుపై తిష్ట వేసిన పశువులు

హైవేపై పశువుల సంచారం

- మహబూబ్‌నగర్‌లో పాదచారులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని జడ్చర్ల – రాయచూర్ (ఎన్‌హెచ్–167) ప్రధాన రహదారిపై పశువుల సంచారం పెరిగింది. ముఖ్యంగా మెట్టుగడ్డ నుంచి షాషాబ్‌గుట్ట హైస్కూల్ వరకు 11 పశువులు రోడ్డుపై సుమారు 10 రోజులుగా అటు ఇటు తిరుగుతున్నాయి. వీటిలో ఐదు ఆవులు, నాలుగు ఎద్దులు, రెండు కోడెదూడలు ఉన్నాయి. నిత్యం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎక్కడబడితే అక్కడ సంచరిస్తుండటంతో వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మార్గంలోని డైట్ కళాశాలతో పాటు షాషాబ్‌గుట్ట హైస్కూల్ సమీపంలో కూరగాయల దుకాణాలు ఉన్నాయి. అక్కడ వీధి వ్యాపారులు పడేసిన కూరగాయల వ్యర్థాలను తినేసి, రోడ్డుపై తిష్ట వేస్తున్నాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ జవాన్ సిరాజ్ మూడు రోజులుగా వాటిని కి.మీ. దూరంలోని పిల్లలమర్రి రోడ్డు వరకు తరుముతున్నా ఎలాంటి ప్రయోజనం దక్కడం లేదు. మరుసటి రోజు అవి తిరిగి ఈ మార్గంలోకి రావడంతో ఏమి చేయాలో తెలియక మున్సిపల్ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా వాటి యజమానులు స్పందించి, వెంటనే తమ ఇళ్లకు తీసుకెళ్లి పోషించాలని కోరుతున్నారు.

ఓబులోనిపల్లిలో భారీ మొసలి లభ్యం



ధరూరు: ఓబులోనిపల్లి శివారులోని ఓ వ్యవసాయ బావిలో భారీ మొసలి లభ్యమైంది. వివరాలు ఇలా.. గ్రామానికి సమీపంలో ఆలయ చెరువుకు అనుకుని ఉన్న తిమ్మప్ప అనే వ్యక్తి పొలంలో బావి ఉంది. కాగా చెరువులో నీళ్ల ఇంకిపోవడంతో అందులోని ఓ మొసలి బావిలోకి ప్రవేశించింది. బావిలో మొసలిని గమనించిన రైతు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని అతికష్టం మీద స్థానికుల సాయంతో దానిని పట్టుకున్నారు. రిక్షాపై తరలించారు. ఈ క్రమంలో ధరూరు వైఎస్సార్ చౌరస్తా వద్ద జనం భారీఎత్తున మొసలిని చూసేందుకు గుమిగూడారు. కాగా సాయంత్రం జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్‌లో మొసలిని వదిలినట్లు అధికారులు తెలిపారు.

కోనేరును పూడ్చిన నిందితుడికి రిమాండ్

జడ్చర్ల: బాదేపల్లి శ్రీ రంగనాయకస్వామి పెద్ద గుట్టపై ఇటీవల కోనేరును పూడ్చివేసిన ఘటనకు సంబంధించిన కేసులో.. బుధవారం పాతబజార్‌కు చెందిన రవితేజగౌడ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి జడ్చర్ల కోర్టులో హాజరు పరిచామని వివరించారు. తదుపరి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. కోనేరులో తవ్వకాలు చేపట్టి తదుపరి మట్టితో పూడ్చడంతో పాటు ఆలయప్రాంగణంలోని వృక్షాలను నరికివేయించడం, పక్కనే ఉన్న గదులను కూల్చడం, రాళ్లను పగుల గొట్టడం వంటి ఘటనలకు సంబంధించి నిందితుడిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా...

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ద.మ.రైల్వే జీఎం భేటీ

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దిల్ కుషా గెస్ట్‌హౌస్‌లో ఆయనతో భేటీ అయిన జీఎం.. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధం

మంత్రి సీతక్కతో భేటీ అనంతరం ఎన్జీవోల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంతో మహిళలు, చిన్నపిల్లల సంరక్షణ, సాధికారత, తదితర అంశాలపై కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పలు స్వచ్ఛంద సంస్థలు ప్రకటించాయి. మహిళలు, చిన్నారుల సంరక్షణ సంబంధిత రంగాల్లో పనిచేస్తూ సామాజిక ఉద్యమాల్లో, సేవా కార్యక్రమాల్లో అనుభవమున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు.. పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్కతో భేటీ అనంతరం ప్రకటించారు. బుధవారం సచివాలయంలో మంత్రితో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధి కాలిఫోర్నియాకి చెందిన మంజుల కృష్ణన్, అంకురం ఎన్జీవో ప్రతినిధులు ఎం.సుమిత్ర, విజయ సమావేశమై ఆయా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విమెన్ ప్రొటెక్షన్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న మహిళల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ మహిళల నైపుణ్యాన్ని పెంచి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సీతక్క కోరారు.

రైల్‌రోకో కేసు విచారణ

సిటీ కోర్టులు: రైల్‌రోకో కేసు విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు తెలంగాణ జన సమితి(టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం హాజరయ్యారు. 2011లో తెలంగాణ ఉద్యమం సమయంలో మాజీ సీఎం, కేసీఆర్, ప్రొ.కోదండరాంచేపట్టిన రైల్‌రోకో కార్యక్రమంలో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ నాంపల్లి కోర్టులో కొనసాగుతోంది. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోగా, ప్రొ. కోదండరాంకు ఎలాంటి స్టే లేకపోవడంతో రూ.10 వేల పూచీకత్తు పెట్టాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసు ట్రయల్‌కు వస్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన కోర్టుకు హాజరయ్యారు.

భూముల తాకట్టు మతిలేని చర్య



- పరిశ్రమలకు ఇచ్చే భూములు కుదువ పెడుతున్న రేవంత్ సర్కార్
- మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్.. రూ.100 కోట్ల కమీషన్
- 'సాక్షి'వార్త కథనాన్ని ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేతకాని రేవంత్ ప్రభుత్వం.. నిధుల సమీకరణకు ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ. 20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్టు సమాచారం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కేటీఆర్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి'దినపత్రికలో 'పరిశ్రమల భూములు తాకట్టు'శీర్షికతో ఈనెల 6వ తేదీన ప్రచురితమైన వార్తా కథనం క్లిప్పింగ్‌ను ట్యాగ్ చేశారు. ప్రభుత్వం భూముల తనఖాకు మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి రు.100 కోట్ల కమీషన్ ఇచ్చేందుకు సిద్ధమైందని, ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి మతిలేని చర్య వల్ల తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడి, కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు లేక, మన బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని, అలాంటి చోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని ఆందోళన వ్యక్తం చేశారు. అసలే గత ఏడు నెలలుగా రాష్ట్ర పారిశ్రామికరంగం స్తబ్దుగా ఉందని, కొత్తగా పెట్టుబడులు రాక, ఉన్న కంపెనీలు కూడా సరైన ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయని పేర్కొన్నారు. 'ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెడితే.. కంపెనీలకు ఏమిస్తారు? కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయి?'అని ప్రశ్నించారు.

బల్లిపడిన టిఫిన్లు... చిట్టెలుకలు తిరిగే చట్నీలు

- కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు

సాక్షి, హైదరాబాద్: ఆనాటి కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ హాస్టళ్లలో పురుగుల అన్నం, నీళ్ల చారు అందిస్తే .. ఈనాటి కాంగ్రెస్ పాలనలో బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు ఇస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఎద్దేవా చేశారు. 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అన్నారు. మొత్తానికి కాంగ్రెసోళ్లు వచ్చి పెద్ద మార్పే తెచ్చారు'అని 'ఎక్స్'వేదికగా ధ్వజమెత్తారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో.. కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదాంతం అయితే, నిన్న కోమటిపల్లి హాస్టల్లో ఉప్మాలో బల్లి పడి 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ హాస్టల్లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థులు బెంబేలెత్తారన్నారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని, అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడ అని ప్రశ్నించారు. అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే విద్యార్థులకు ఈ అవస్థ, అస్వస్థత అని కేటీఆర్ విమర్శించారు.

రాష్ట్ర ఖజానాకు 'కిక్కు'

- గత ఏడాదితో పోలిస్తే ఈ సారి తొలి రెండు నెలల్లో రూ.2,500 కోట్ల అధిక రాబడి
- అప్పులు గత ఏడాది కంటే రూ.2 వేల కోట్లు తక్కువే
- స్థిరమైన ఆదాయంతో ఆర్థిక శాఖకు కొంత మేర ఉపశమనం



సాక్షి, హైదరాబాద్: గత ఏడాదితో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వ రాబడులు మెరుగయ్యాయని ఆర్థిక గణాంకాలు చెబుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్, మే నెలల ఆదాయ, వ్యయాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు సమర్పించిన వివరాల ప్రకారం గత ఏడాదితో పోలిస్తే తొలి రెండు నెలల్లో అప్పులు తగ్గగా, సొంత పన్ను రాబడులు పెరిగాయని అర్థమవుతోంది. వస్తుసేవల పన్ను (జీఎస్టీ), రిజిస్ట్రేషన్ల ఆదాయం, అమ్మకపు పన్ను, ఎక్సైజ్ ఆదాయం.. ఇలా ప్రతి పన్ను ఆదాయంలోనూ గత ఏడాది తొలి రెండు నెలలతో పోలిస్తే వృద్ధి కనిపించింది. మొత్తంమీద గత రెండు నెలల్లో ప్రభుత్వానికి రూ. 23,147.64 కోట్లు సమకూరాయి. అదే గత ఏడాది తొలి రెండు నెలల్లో 22,427.81 కోట్లు లభించాయి. అయితే, పన్ను రాబడుల విషయానికి వస్తే గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రూ.20,097.73 కోట్లు రాగా, ఈ ఏడాది తొలి రెండు నెలల్లో 22,419.13 కోట్లు వచ్చాయి. అంటే, గత ఏడాది కంటే పన్ను రాబడులు రూ.2,500 కోట్ల వరకు పెరిగాయన్న మాట. ఇక, అప్పులు కూడా గత ఏడాదితో పోలిస్తే రూ.2 వేల కోట్ల మేర తగ్గినా మొత్తం మీద రూ.వెయ్యి కోట్లకు పైగా రాబడులు సమకూరడం, ఆదాయం స్థిరంగా కొనసాగుతుండటంతో ఆర్థిక శాఖ కొంత మేర ఊపిరి పీల్చుకుంటోంది.

గత రెండేళ్లలో ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వ రాబడి గణాంకాలివి.. (రూ.కోట్లలో)

ఆదాయ వనరు	2023-24		2024-25	
	ఏప్రిల్-	మే	ఏప్రిల్-	మే
పన్ను రాబడులు	9,698.65	10,399.08	11,464.17	10,954.96
పన్నేతర రాబడులు	357.64	533.83	354.71	373.80
గ్రాంట్ ఇన్‌ఎయిడ్	----	1,438.61	----	----
అప్పులు	5,026.29	4,240.12	2,246.62	5,133.65

వీఆర్వోలను మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకోండి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మణ్‌లకు వీఆర్వో జేఏసీ వినతి



జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న వీఆర్వో జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో)ను మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ వీఆర్వోల జేఏసీ కోరింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధి బృందం బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న తమను అశాస్త్రీయంగా ఇతర శాఖల్లోకి పంపి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా గత ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించిందని ఆవేదన చెందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగులు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నుంచి భూముల పరిరక్షణలో నిమగ్నమై, దాడులకు గురై, ప్రభుత్వ సంక్షేమమే ధ్యేయంగా, నియమ నిబద్ధతతో కీలక భూమిక పోషించిన తమను తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. రాత్రికి రాత్రే లాటరీ పద్ధతిలో ఉత్తర్వులు జారీ చేసి 24 గంటల్లో ఇతర శాఖల్లోకి బదిలీ చేశారని, ఖాళీలు లేని శాఖలకు పంపి అవమానించారని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌లను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్, సెక్రటరీ జనరల్ హరాలే సుధాకర్‌రావు, అదనపు సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేశ్, వైస్ చైర్మన్లు చింతల మురళి, ప్రతిభ, నేతలు తిరుపతి, యాదగిరి, శేఖర్ తదితరులున్నారు. తమ వినతి పట్ల జీవన్‌రెడ్డి, లక్ష్మణ్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఉన్న 10,909 గ్రామాలకు రెవెన్యూ ఉద్యోగులను నియమించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు.

నేడు రాష్ట్రానికి కురియన్ కమిటీ

- గెలిచిన ఎంపీలు, ఓడిన అభ్యర్థులతో సమావేశం
- రేపు ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలతో భేటీ
- శనివారం క్షేత్రస్థాయికి..

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతల పనితీరును అంచనా వేసేందుకు హైకమాండ్ నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్ కురియన్, రకీబుల్ హుస్సేన్, పర్గత్‌సింగ్‌లతో కూడిన ఈ బృందం గురువారం ఉదయం 10 గంటలకు గాంధీభవన్‌కు రానుంది. ముందుగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులతో భేటీ కానుంది. అనంతరం గెలిచిన ఎంపీలతో కమిటీ సమావేశమవుతుందని, శుక్రవారం లోక్‌సభ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తుందని సమాచారం. ఈ భేటీల్లో వచ్చిన సమాచారాన్ని బట్టి శనివారం క్షేత్రస్థాయికి వెళ్లి పార్టీ నేతలతో మాట్లాడుతుందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.



రాష్ట్రానికి వచ్చిన కురియన్ బృందానికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు హర్కర, నిరంజన్

వీధి కుక్కల నియంత్రణకు చర్యలేవి?

జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై తప్పుబట్టిన హైకోర్టు

- పిల్లలు చనిపోతున్నా చర్యల్లో నిర్లక్ష్యాన్ని సహించమని హెచ్చరిక
- నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వీధి కుక్కల నియంత్రణకు ఏం చేశారన్న గణాంకాలు కాదని, ఇకపై చిన్నారులపై దాడి, మరణాలు జరగకుండా ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు నిలదీసింది. ఓ పక్క చిన్నపిల్లలు చనిపోతుంటే స్టెరిలైజేషన్ చేశామంటూ లెక్కలు చెబుతున్నారంటూ జీహెచ్ఎంసీ అధికారుల తీరును తప్పుబట్టింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో స్టెరిలైజేషన్ సరే.. మరి మురికివాడల పరిస్థితి ఏంటని ప్రశ్నించింది. విషాదకర ఘటనలు మురికివాడల్లోనే చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేసింది. ఇలాంటి ఘటనలపై పరిహారం అందజేసి చేతులు దులుపుకోకుండా, మానవీయ కోణంలో స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సి ఉందని స్పష్టం చేసింది. దీనిపై ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

ఆ దారుణ ఘటనపై కథనాలే సుమోటోగా..

జూన్ 28న పటాన్‌చెరు ఇస్నాపూర్‌లో వీధి కుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు విశాల్ మృతి చెందాడు. బిహార్ చెందిన వీరి కుటుంబం పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ దారుణంపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. అలాగే గతంలో ఇదే అంశంపై పెండింగ్‌లో పిటిషన్లకు దీన్ని జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం, నిబంధనలు రూపొందించడం కాదు.. వాటిని కఠినంగా అమలు చేసే వ్యవస్థ ఉండాలని వ్యాఖ్యానించింది. పిల్లలు చనిపోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని తేల్చి చెప్పింది. ఏ ఒక్కరినీ వదిలే పరిస్థితి ఉండకూడదని చెప్పింది. కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

అది ఫేక్ నోటిఫికేషన్: ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ప్రకటనను నమ్మొద్దని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టంచేశారు. ఆర్టీసీలో 3,035 పోస్టుల భర్తీకి ఇటీవల ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. ఆ భర్తీ ప్రక్రియను టీజీపీఎస్సీ, పోలీస్, మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డులు సంయుక్తంగా చేపట్టనున్నాయి. ఇప్పటివరకు ఆయా సంస్థలు షెడ్యూల్‌ను ప్రకటించలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఓ ఫేక్ నోటిఫికేషన్ వైరల్‌గా మారింది. ఈ పోస్టుల భర్తీకి ఆర్టీసీ చర్యలు చేపట్టిందని పేర్కొంటూ ఓ బోగస్ నోటిఫికేషన్‌ను సోషల్ మీడియాలో కొందరు వైరల్ చేశారు. అందులో ఉన్న లింకును క్లిక్ చేసి ఆసక్తి ఉన్న అభ్యర్థులు వివరాలను నమోదు చేయాలని అందులో పేర్కొన్నారు. అయితే ఇది ఫేక్ నోటిఫికేషన్ అని, అభ్యర్థులెవరూ మోసపోవద్దని సజ్జనార్ తెలిపారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు నగదు పురస్కారం

- సీఎం చేతులమీదుగా రూ. 25 లక్షల చెక్కు అందుకున్న దాసరి కొండప్ప

దామరగిద్ద: నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన బుర్రవీణ కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పకు రాష్ట్ర ప్రభుత్వం నగదు పురస్కారం ప్రకటించింది. ఈమేరకు బుధవారం సీఎం క్యాంపు ఆఫీస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 25 లక్షల చెక్కు అందజేశారు. గ్రామీణ బుర్రవీణ కళను కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డుతో సత్కరించడం.. రాష్ట్ర ప్రభుత్వం నగదు పురస్కారం అందజేయడంపై దాసరి కొండప్ప కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా చెక్కు అందుకుంటున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్ప

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో అలసత్వం వద్దు



చెంచు మహిళ ఈశ్వరమ్మను పరామర్శిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

- చెంచు మహిళ ఈశ్వరమ్మ కుటుంబానికి అండగా ఉంటాం
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

నాగర్‌కర్నూల్/కొల్లాపూర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో అలసత్వం వహించవద్దని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, నినావత్ రాంబాబు నాయక్, శంకర్‌లతో కలిసి ఆయన నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించారు. కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో ఇటీవల దాడికి గురైన చెంచు మహిళ ఈశ్వరమ్మను పరామర్శించారు. స్థానికులతో ఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈశ్వరమ్మపై దాడికి పాల్పడ్డ వారిలో కొందరిని ఇంకా అరెస్టు చేయలేదని చెంచులు కమిషన్ చైర్మన్‌కు వివరించారు. దాడికి పాల్పడ్డ బండి శివ మళ్లీ తమను బెదిరిస్తున్నాడని.. ఆయన నుంచి తమకు ప్రాణహాని ఉందని ఈశ్వరమ్మ వాపోయింది. అనుమానాస్పద రీతిలో మరణించిన చెంచు నాగన్న మృతిపై కూడా నిష్పక్షపాత విచారణ జరగాలని ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు కోరారు. కాగా, దాడికి పాల్పడ్డ నిందితులపై నమోదు చేసిన కేసులు, వారిపై తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలు తమకు అందజేయాలని ఆయన పోలీసులను ఆదేశించారు. చెంచుల భూముల రక్షణకు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఐటీడీఏ ఆధ్వర్యంలో బాధిత మహిళ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు.

- కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, పోలీస్ ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో ప్రతినెలా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. ఏదేని ఘటన వెలుగుచూసిన వెంటనే బాధితులకు ఆర్థికసాయం అందించాలని, కేసు నమోదుతో పాటు చార్జిషీట్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. అట్రాసిటీ కేసుల పరిష్కారం, పరిహారం పంపిణీలో ఆలస్యమైతే, బాధితులకు చట్టంపై విశ్వసనీయత తగ్గే ప్రమాదముందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఇదిలా ఉంటే, వివిధ సంఘాల నాయకులు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి, పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.
- కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కేసుల పురోగతి, వారు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగా అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీలు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి, పూర్తిస్థాయి నివేదికలను ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల భూసమస్యల స్థితిగతులు, పరిష్కారానికి తీసుకున్న చర్యలను వెల్లడించాలని అధికారులకు సూచించారు. పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, అదనపు ఎస్పీ రామేశ్వర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ రోహిత్ గోపిడి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాంలాల్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్ ఉన్నారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

కోస్గి: రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. ఆశించిన స్థాయిలో ప్రజలకు పాలన అందడం లేదని, ఇతర రాష్ట్రాలను పోలిస్తే తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. ఎంపీగా విజయం సాధించిన తర్వాత బుధవారం మొదటిసారి నియోజకవర్గానికి వచ్చిన ఆమెకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. స్థానిక రామాలయం చౌరస్తా నుంచి శివాజీ చౌక్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏబీకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై, తమ పార్టీపై తప్పుడు ప్రచారం చేసినా కొడంగల్ నియోజకవర్గ ప్రజలు 63 వేల ఓట్లు వేసి ఆదరించారని.. ఇక్కడి ప్రజలకు, పార్టీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల వరకే కుట్రలు, కుతంత్రాలు ఉంటాయని.. పార్టీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా రాజకీయ కక్షలు మానుకొని సఖ్యతగా ఉంటూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధిద్దామన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం జరగాలన్నా, ట్రిపుల్ ఆర్, కృష్ణా–వికారాబాద్ రైల్వేలైన్ ఏర్పాటు వంటి పనులకు కేంద్ర నిధులతో పాటు సహకారం అవసరమని తెలిపారు. జిల్లాలో సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించామని, త్వరలోనే జిల్లాలో అవసరమైన చోట్ల రహదారి నిర్మాణాలు చేపడతామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, పార్టీ తరుపున అన్నివిధాలుగా అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీని ఘనంగా సన్మానించారు. అంతకుముందు రామాలయం, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నాగులపల్లి ప్రతాప్‌రెడ్డి, పార్లమెంట్ ప్రభారి రాజు, తాలుకా ప్రభారి రాజవర్దన్, మండలపార్టీ అధ్యక్షుడు సీబీ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, లీగల్‌సెల్ అధ్యక్షుడు బస్వరాజ్, నాయకులు బంటు రమేష్, గందె వెంకటయ్య, కన్నారావు, కిరణ్‌కుమార్, వెంకట్రాములు, బద్రీనాథ్, అంబదాస్, శ్రీనివాస్, రమేష్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

హోమయాగాలతోనే సమృద్ధిగా వర్షాలు

- శ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ



లక్ష తమలపాకుల అర్చన నిర్వహిస్తున్న శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ

నాగర్‌కర్నూల్: విద్య అభ్యసన సమయంలో ఆటంకాలు కలుగకుండా నివారిస్తూ.. విద్యాప్రాప్తికి గణపతి స్వామివారిని శాస్త్రోక్తంగా హోమాలతో భక్తులు కొలిచారని శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలియజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో ఈ నెల 7 నుంచి 21వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం అయుత చండీ, అతి రుద్రం, సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా నాలుగో రోజు బుధవారం గోపూజ యాగశాల ప్రదక్షిణ హోమాలు నిర్వహించారు. వేద హోమాలు, చండీ, రుద్ర, రామాయణం భాగవత సుందరకాండ చతుర్వేద హోమాలు, సామవేద యజుర్వేద, అధర్వణ, వేద ఋగ్వేద, ఋత్వికులు వేద మూర్తులైన బ్రాహ్మణులతో వేద మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా చేశారు. అదేవిధంగా నిత్యం నిర్వహించే సామూహిక హోమాల్లో భాగంగా సంతాన ప్రాప్తికి పుత్ర కామేష్టి హోమాలు నిర్వహించారు. భక్తులతో సామూహికంగా శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి వారి కల్యాణం ఉత్సవం కనులపండువగా నిర్వహించారు. నిత్యం నిర్వహించే కార్యక్రమాల్లో ఆటంకాలు చోటుచేసుకోకుండా, సంకట విమోచన, విద్యా సంప్రాప్తికి జన్మరత్న గోచార రీత్యా గ్రహదోష పరిహారం చెందేందుకు గణపతి స్వామి వారి కల్యాణ హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు లక్ష గరిక అర్చన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీకృష్ణ, గణపతి స్వామివారి నామస్మరణతో జయజయ ధ్వనులతో మండపం కిక్కిరిసింది. అతి రుద్ర చండీ ఇతర హోమాలకు సహకరించిన దాతలకు సేవాకర్తలకు యువత, పురుష, మహిళ భక్తులందరికీ శ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆశీర్వాద అనుగ్రహ భాషణం చేశారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో బుధవారం 8,000 మంది వరకు అన్నప్రసాదం స్వీకరించారు. గురువారం ఉదయం శ్రీలక్ష్మీ కుబేర సహిత ధన్వంతరి హోమాలు, పుత్రకామేష్టి హోమాలు, సాయంత్రం 6 గంటలకు సీతారామ కల్యాణ మహోత్సవం వేదమూర్తులైన బ్రాహ్మణులతో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఉత్సాహంగా విద్యుత్ ఉద్యోగుల బ్యాడ్మింటన్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బుధవారం టీజీ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్ (పురుషుల) చాంపియన్‌షిప్ టోర్నీ ఉత్సాహంగా ప్రారంభమైంది. మొత్తం 130 మంది విద్యుత్ ఉద్యోగులు పాల్గొంటుండగా.. సింగిల్స్, డబుల్స్, టీమ్ ఈవెంట్‌లో మ్యాచ్‌లు జరుగుతున్నాయి. పోటీలను టీజీ ట్రాన్స్‌కో (ట్రాన్స్‌మిషన్) డైరెక్టర్ టి.జగత్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో ఉద్యోగుల్లో ఐక్యత పెంపొందుతుందని.. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండారని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని.. ఓడిన వారు నిరాశ చెందకుండా గెలుపు కోసం శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ డి.లత వినోద్, ఓఎంసీ ట్రాన్స్‌కో ఎస్ఈ వాసుదేవరావు, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, క్రీడల అధికారి టి.జగన్నాథ్, ట్రాన్స్‌కో ఏఈ రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు ఫలితాలు..

టీమ్ ఈవెంట్ విభాగంలో వరంగల్ ఆపరేషన్ జట్టు నిజామాబాద్ సర్కిల్‌పై, విద్యుత్‌సౌధ జట్టు నల్గొండ ఆపరేషన్ జట్టుపై గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరాయి. అదేవిధంగా మహబూబ్‌నగర్ ట్రాన్స్‌కో ఓఎంసీ జట్టు ఖమ్మం ఓఎంసీపై, బంజారాహిల్స్ జట్టు మెదక్ జట్టుపై విజయాలు నమోదు చేసుకొని క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి.



మాట్లాడుతున్న డైరెక్టర్ టి.జగత్‌రెడ్డి



బ్యాడ్మింటన్ ఆడుతున్న ఉద్యోగులు